క్లుప్తంగా

'సిద్ధం' సభ పోస్టర్ల ఆవిష్కరణ

కాకుమాను:బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం మేదరమెట్లలో ఆదివారం నిర్వహించనున్న సిద్ధం సభకు వెళ్లేందుకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధంగా ఉన్నారని జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. కాకుమానులో శనివారం సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకుల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని వారు కోరారు.

అంకమ్మ గుడిలో షెడ్డు నిర్మాణానికి విరాళం



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని అంకమ్మగుడిని పునర్నిర్మిస్తున్నారు. ఈనేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో షెడ్డును నిర్మిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా చేస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బాపతు మదనగోపాలరెడ్డి, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయినిగా చేస్తున్న రుద్రమదేవి దంపతులు రూ. 5 లక్షల చెక్కును ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు బాపతు సాంబశివారెడ్డికి అందజేశారు. తన తల్లిదండ్రులు బాపతు చెన్నారెడ్డి, నాగరత్నమ్మల జ్ఞాపకార్థం విరాళమిచ్చినట్లు మదనగోపాలరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గంగిరెడ్డి నాగమల్లేశ్వరి, మురళీధర్‌రెడ్డి, మూలె వెంకటరామిరెడ్డి, ఇగుటూరి నరసారెడ్డి, చిన్నపురెడ్డి అంజిరెడ్డి, కట్టెబోయిన శివయ్య పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని మహిళ ఆత్మహత్య

గుంటూరు రూరల్: మతిస్థిమితంలేని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆళ్ల శ్రీనివాసరెడ్డి భార్య వాణి(36)కి గత కొంతకాలంగా మతిస్థిమితం ఉండటం లేదు. దీనికి తోడు అనారోగ్యం బారిన పడటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓట్ల కోసం ప్రభుత్వ భూమి ఎర

- చోద్యం చూస్తున్న అధికారులు
- అంగన్‌వాడీ భవనానికి తీర్మానం చేసినా కాగితాలకే పరిమితం



తక్కెళ్లపాడులో ఓట్ల కోసం కేటాయించేందుకు శుభ్రం చేసిన ప్రభుత్వ భూమి

పెదకాకాని: ఓట్ల కోసం ఏకంగా ప్రభుత్వ భూమిని ఎర వేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో గ్రామంలోని పెత్తందారులు ఏకంగా ప్రభుత్వ భూమిని మూడు కులాలకు కమ్యూనిటీ భవనాలు కట్టుకునేందుకు ఇస్తున్నాం .. ఎన్నికల్లో గెలిచిన తర్వాత నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామంటూ హామీలు ఇస్తున్నా అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. అదే భూమిలో అంగన్‌వాడీ భవనం నిర్మించేందుకు ఇప్పటికి రెండుసార్లు తీర్మానాలు చేసినా కాగితాలకే పరిమితమైంది గానీ నిర్మాణానికి నోచుకోలేదు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడు సర్వే నంబరు 16లోని ప్రభుత్వ స్థలంలో అంగన్‌వాడీ భవనం నిర్మించేందుకు 2017 డిసెంబరు 23వ తేదీన పంచాయతీ తీర్మానం జరిగింది. అదే స్థలంలో అంగన్‌వాడీ భవనం, గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం నిర్మాణం కోసం 2020 సెప్టెంబరు 3వ తేదీన మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీర్మానించారు. ఆ తరువాత కొంతకాలానికి సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మించారు. విలేజ్ హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీ భవనం నిర్మించాల్సి ఉంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామంలోని కొందరు పెద్దలు ఓట్ల గాలం వేస్తూ ఇప్పటి వరకూ గుర్తుకు రాని కమ్యూనిటీ భవనాలకు స్థలాల కేటాయింపు, నిధులు మంజూరు వంటి అంశాలను తెరపైకి తెచ్చారు. ఈ స్థలాలను కేటాయించడం, కమ్యూనిటీ భవనాలు నిర్మాణం సాధ్యం కాదని తెలిసినప్పటికీ ఈ తాయిలాలు గ్రామంలోని మూడు కులాలకు ఎరవేశారు. దీంతో మరికొన్ని కులాల వారు మేం కనిపించడం లేదా ? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 50 ఏళ్లుగా గ్రామంలో సుమారు 60 కుటుంబాలు రోడ్లు, కాలువకు మధ్యలో గుడిసెలు వేసుకుని బతుకుతున్నా వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలనే ఆలోచన రాని పెద్దలు తాజాగా ఓట్ల కోసం గాలం వేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పిల్లలకు ఇబ్బంది లేకుండా అంగన్‌వాడీ సెంటర్ నిర్మించాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి హరిబాబును వివరణ కోరగా త్వరలో జరగబోయే పంచాయతీ సమావేశంలోని ఎజెండాలో ఈ అంశాలను చేర్చడం జరిగిందని తెలిపారు.

అద్దె ఇంటిలోనే ఇబ్బంది పడుతున్నాం



కనీస సౌకర్యాలు లేని అద్దె ఇంటిలో ఎస్టీకాలనీ అంగన్‌వాడీ సెంటర్ నిర్వహిస్తున్నా. ఇప్పటికి రెండుసార్లు 2017, 2020 సంవత్సరాల్లో అంగన్‌వాడీ సెంటర్ నిర్మించేందుకు సర్వే నంబరు 16లోని భూమిని గుర్తించారు. అంగన్‌వాడీ సెంటర్ మాత్రం నిర్మాణానికి నోచుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చిన్నారులకు అన్ని వసతులతో కూడిన అంగన్‌వాడీ భవనం నిర్మించాలని కోరుతున్నా...

–షేక్ ఝాన్సీ, అంగన్‌వాడీ కార్యకర్త ఎస్టీకాలనీ, తక్కెళ్లపాడు

శ్రమల నుంచి భక్తులకు దేవుడు విముక్తి





భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న మంత్రి రజిని, శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు

- హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ
- మూడవ రోజు కొనసాగిన 47వ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు

గుంటూరు రూరల్: దేవుడు భక్తులకు శ్రమల నుంచి విముక్తి కలిగిస్తాడని హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీలు తెలిపారు. మూడు రోజులుగా నగర శివారు గోరంట్ల లోగల హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 47వ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు శనివారం కొనసాగాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, పొన్నూరు ఎమ్మెల్యే, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్ కిలారి వెంకటరోశయ్య, ప్రభుత్వ సలహాదారులు జూపూడి ప్రభాకర్, బాలస్వామి, ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్. ఆర్‌టీఐ కమిషనర్ శ్యామ్యూల్, డీఐజీ విజయరావు క్రీస్తు భక్తులకు గుడారాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలు, పేదలతో పాటు ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసిన జగనన్నకు ప్రజలంతా అండగా ఉండి ఆయన్ను ఆశీర్వదించాలని కోరారు. మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్స్ క్రీస్తు స్తుతి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ పాస్టర్స్ ఫ్రెడిపాల్, పాస్టర్ రాజు, పాస్టర్ రమేష్, పాస్టర్స్ సిస్టర్స్ పాల్గొన్నారు. మూడవ రోజు ప్రార్థనల్లో సుమారు ఆరు లక్షల మంది భక్తులు పాల్గొన్నారు. ఆదివారం మధ్యాహ్నంతో ప్రార్థనలు ముగియనున్నట్లు మినిస్ట్రీస్ ప్రతినిధులు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు న్యాయం జరిగే వరకు పోరు

పెదకాకాని:రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతులకు న్యాయం జరిగే వరకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) పోరాటం చేస్తుందని జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల పెన్షన్ రూ. 6,000కు పెంచాలని డిమాండ్ చేస్తూ '' చలో అమరావతి – వికలాంగుల మహాగర్జన '' పిలుపులో భాగంగా శనివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల బైబిల్ మిషన్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉన్న విభిన్న ప్రతిభావంతులకు వాహనాలను సమకూర్చాలని కోరారు. సమాజంలో విభిన్న ప్రతిభావంతులు వివక్షతకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆ కానిస్టేబుల్ వసూల్‌రాజా

- మహిళలపై దాష్టీకం
- బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన అధికారులు
- వెలుగు చూస్తున్న దందాలు
- వీఆర్‌కు పంపిన ఉన్నతాధికారులు

పెదకాకాని: మహిళలను కొట్టి దాడి చేసిన కానిస్టేబుల్‌ను ఉన్నతాధికారులు విధుల నుంచి వెనక్కి పిలిచిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పెదకాకాని మండలంలో చక్రవర్తి అనే కానిస్టేబుల్ సీఐ సెల్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన మండలానికి వచ్చిన కొద్దిరోజుల్లోనే ఎస్‌బీ కానిస్టేబుల్ అంటూ పాస్‌పోర్టుల విచారణ, ఐడీ పార్టీ అంటూ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారితోనూ పరిచయాలు పెంచుకున్నాడు. ఈనెల 6వ తేదీన మండలంలోని వయో వృద్ధుల ఆశ్రమం పక్కనే నంబూరు వెళ్లే డొంక వద్దకు గత కొంతకాలంగా మంగళగిరి ప్రాంతానికి చెందిన మహిళలు చేరి పొట్టకూటి కోసం వ్యభిచారానికి పాల్పడుతున్నారు. ఆ ప్రాంతానికి కొద్ది రోజులుగా మరో ముగ్గురు మహిళలు జట్టుగా అక్కడికి చేరుతున్నారు. అప్పటికే ఒక గ్రూపు మహిళలతో పరిచయం ఉన్న కానిస్టేబుల్ వారి ఒత్తిడి మేరకు రెండో గ్రూపు వారిని అక్కడ నుంచి వెళ్లిపోవాలంటూ కేకలు వేస్తూ ,శరీరంపై వాతలు పడేలా కొట్టి దాడి చేశాడు. ఆ మహిళలు లబోదిబో అంటూ పెదకాకాని పోలీసు స్టేషన్‌కు చేరుకుని గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన సంబంధిత అధికారి వారి శరీరంపై వాతలు పడటం చూసి మానవతా దృక్పథంతో ఆలోచించి విచారణ చేపట్టాడు. బాధిత మహిళల్లో ఒకరి వద్ద ఉన్న ఫోన్ నంబరు ఆధారంగా ఆ కానిస్టేబుల్‌ను గుర్తించారు. దీంతోపాటు రేషన్ బియ్యం వాహనాల నిర్వాహకులు, పేకాట నిర్వాహకులు, బెల్టుషాపుల నిర్వాహకుల వద్ద కూడా నెలవారీ వసూళ్లు, సెటిల్‌మెంట్‌లు చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణకు వచ్చారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పిలిచారు. తోటి ఉద్యోగిని కాపాడేందుకు కొందరు పోలీసులు పూర్తి సమాచారం ఉన్నతాధికారులకు తెలియకుండా దాటవేస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులకు అందిన నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని సిబ్బంది తెలిపారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ ఉమాశంకర్‌రెడ్డి తదితరులు

గుంటూరు రూరల్: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది నేడు సమాజాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సెల్ఫ్‌ఫోర్స్ కంపెనీ ద్వారా 1000 మందికిపైగా విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని టీ హబ్‌లో అవార్డుల ప్రదానోత్సవం జరిగిందని తెలిపారు. ఇందులో తమ కళాశాల విద్యార్థినులు ఈ క్వాలిటీ ఆఫ్ ఎక్స్‌లెన్సీ అవార్డును సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు సెల్ఫ్‌ఫోర్స్ సంస్థ ద్వారా ఇంటర్న్ షిప్‌లు పూర్తి చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బీఎస్‌బీ రెడ్డి, ఉపాధి కల్పనాధికారి పి.ఎల్. మాధవరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పబ్లిక్ పరీక్షల్లో ఆందోళన వద్దు

పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు



విద్యార్థినికి హాల్ టికెట్ అందజేస్తున్న శ్రీధర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: పబ్లిక్ పరీక్షల పేరుతో అర్థంలేని ఆందోళన వద్దని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు సూచించారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పదో తరగతి అనేది పాఠశాల విద్యార్థి దశలో చివరి దశ అన్నారు. దాన్ని విజయవంతంగా పూర్తి చేసి, ఇంటర్మీడియెట్ దశలోకి అడుగుపెట్టేందుకు సిద్ధం కావాలని సూచించారు. పాఠశాల విద్యార్థిగా గడిపిన రోజులు జీవితాంతం గుర్తుండిపోతాయని, పదో తరగతి పరీక్షలు రాసిన తరువాతే ఇచ్చే సర్టిఫికెట్ జీవితంలో ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. ఏడాది పొడవునా విద్యార్థులు చదివిన పాఠ్యాంశాలే ప్రశ్న పత్రంలో వస్తాయని, సక్రమమైన ఆలోచనలు, మానసిక ప్రశాంతతో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హాల్ టికెట్లు, ప్యాడ్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖరరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.